క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి శివకుమార్ రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలకు ఎంపికయ్యాడని హెచ్ఎం రమేష్ బాబు మంగళవారం తెలిపాడు. ఈసందర్భంగా విద్యార్థిని సైన్స్ ఉపాధ్యాయులు ఉప్పలయ్య, సోమేశ్వర్, ఝాన్సీ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి, శ్రీనివాసరావు, తిరుపతి, శిఖారాణి, శ్రీనివాస్, సతీష్ కుమార్, మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, వనజ పాల్గొన్నారు.

నేటినుంచి మార్కెట్‌కు సెలవులు

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు మేడారం జాతర సందర్భంగా, కార్మిక సంఘాల కోరిక మేరకు నేటి నుంచి 23వ తేదీ వరకు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు తెలిపారు. అదేవిధంగా ఈనెల 24, 25వ తేదీల్లో(శని, ఆదివారం) వారాంతపు సెలవులు కావడంతో, వరుసగా మార్కెట్‌కు 5రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు తెలిపారు.

విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

మహబూబాబాద్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ డేవిడ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల విధులపై అదనపు ఎస్పీ చెన్నయ్యతో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు అసెంబ్లీ ఎన్నికల సమయంలో సమర్థవంతంగా పని చేశారని, పార్లమెంట్ ఎన్నికల్లో అంకితభావంతో పని చేయాలన్నారు. ఎన్నికలకు ముందస్తుగా సిబ్బందిని సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ రమాదేవి, డీఆర్‌డీఓ పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మహబూబాబాద్ రూరల్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపడుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మంజూరు చేసిన నిధులతో మండలంలోని కంబాలపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించాడు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు చీరిక ఉపేందర్ రెడ్డి, వెంకన్న, వెంకటరెడ్డి, ఉపేందరెడ్డి, దాసు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్ ఎంపికలు

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 22న ఉదయం 9గంటలకు 400మీటర్ల జిల్లాస్థాయి అథ్లెటిక్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాస నాగమణి మంగళవారం తెలిపారు. అండర్ 14, 18, 20 విభాగంలో ఎంపికైన వారు ఈనెల 25న హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పూర్తి వివరాలకు 90526 70288 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పశువైద్యశాల సందర్శన

దంతాలపల్లి: మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో 'పశువైద్యశాలలో వైద్యుడిని నియమించాలి' అనే శీర్షిక మంగళవారం ప్రచురితమైన సాక్షి కథనానికి జిల్లా పశువైద్యాధికారి సుధాకర్ స్పందించారు. మంగళవారం మండల కేంద్రంలోని పశువైద్యశాలను సందర్శించాడు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని అల్పసంఖ్యాక వర్గాల వారు విదేశాలలో పైచదువుల కోసం సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ అధికారి బి.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. 2023 ఆగస్టు 1నుంచి డిసెంబర్ 31వరకు ఫాల్ సీజన్ అడ్మిషన్లు పొందిన అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నేటినుంచి మార్చి 20 వరకు సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5లక్షల లోపు ఉండాలన్నారు. స్కాలర్ షిప్, ఆర్థికసాయం కింద రూ.20లక్షలు రెండు విడతల్లో చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో భవనం మొదటి అంతస్తు 17వ గదిలో దరఖాస్తులు ఇవ్వాలన్నారు. పూర్తి వివరాలకు 73966 91373, 98859 83942 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

కీర్తిప్రతిష్టలు తీసుకురావాలి

మహబూబాబాద్ రూరల్: ట్రెయినీ కానిస్టేబుళ్లు పోలీస్‌శాఖకు కీర్తిప్రతిష్టలు తీసుకువచ్చే రీతిలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకోవాలని అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య సూచించారు. శిక్షణ కోసం వివిధ ట్రైనింగ్ సెంటర్లకు వెళ్తున్న నూతన కానిస్టేబుళ్లకు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం కిట్ ఆర్టికల్స్ అందజేశారు.

సమస్యల వలయంలో పల్లెలు

- అంతర్గత రహదారులు అస్తవ్యస్తం
- చెత్తాచెదారం, మురుగు నీటితో వీధులు
- పట్టించుకోని ప్రత్యేక అధికారులు

మరిపెడ రూరల్: మండలంలోని పలుగ్రామాలు సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నాయి. సర్పంచుల పదవీకాలం ముగిసిన తర్వాత గ్రామాలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రత్యేకపాలన అధికారులకు నియమించినప్పటికీ వారు గ్రామాల్లో పర్యటించడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. దీంతో గ్రామాల్లో సమస్యలన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పల్లెల్లో పరిస్థితి నెలకుంది.

మరిపెడ మండలంలోని 44 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జనవరి 31తో సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకపాలన అధికారులను ప్రభుత్వ నియమించింది. కానీ ఒక్కొక్క అధికారికి 3గ్రామాల చొప్పున నియమించడంతో వారు ఏ గ్రామాన్ని సందర్శించాలో అర్థం కాక సతమతమవుతున్నారు. వారు వచ్చిన జీపీలో నిధులేమి లేకపోవడం, గ్రామాల్లో పేరుకపోయిన సమస్యలు పరిష్కరించే మార్గం కనిపించకపోవడంతో వారు చుట్టం చూపుగా వచ్చి పోతున్నట్లు పలువురు చెబుతున్నారు. దీంతో గ్రామాల్లో పురవీధులన్నీ



వెంకట్యతండాలో ప్రధాన రహదారి వెంట చెత్తాచెదారం



చింతలగడ్డతండాలో ప్రధాన రహదారిలో ప్రవహిస్తున్న మురుగు

చెత్తాచెదారంతో పేరుకపోయి అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఆయా గ్రామాల్లో డ్రెయినేజీలో పేరుకపోయి చెత్తను తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. వీధులను శుభ్రం చేయడం లేదని, రోడ్లపై మురుగు ప్రవహిస్తూ దోమలు వ్యాపిస్తున్నా



అస్తవ్యస్తంగా డ్రెయినేజీ

దోమలు వ్యాపిస్తున్నాయి..



గ్రామాల్లో సైడ్ కాల్వల్లో చెత్తపేరుకపోయి వీధుల్లో మురుగు ప్రవహిస్తు దుర్వాసన వెదజల్లుతోంది. కనీసం గ్రామస్తులు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. మురుగుతో దోమలు వ్యాపించి ప్రజలకు నిద్రలేకుండా చేస్తున్నాయి.

– బాదావత్ రవి, కోట్యతండా, మరిపెడ

యని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో పేరుకపోయిన సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తల్లుల చెంతకు భక్తులు

- సమ్మక్క–సారలమ్మ దర్శనానికి కుటుంబ సమేతంగా ప్రయాణం

నెహ్రూసెంటర్: సమ్మక్క–సారలమ్మ మేడారం జాతర సందర్భంగా మహబూబాబాద్ నుంచి తల్లుల దర్శనానికి, మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు తరలివెళ్తున్నారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరగనున్న అతిపెద్ద మేడారం జాతరకు అన్నిప్రాంతాలతో పాటు మహబూబాబాద్ జిల్లా నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో కుటుంబ సమేతంగా పిల్లాపాపలతో వనదేవతల దర్శనానికి వెళ్తున్నారు. మహబూబాబాద్ ఆర్టీసీ డిపోలో భక్తుల సౌకర్యార్థం 150 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. దీంతో ఆర్టీసీ బస్సుల ద్వారా మేడారంకు వెళ్తున్నారు. నేటి నుంచి ఈ నెల 24వ తేదీ వరకు తెలంగాణ కుంభమేళా మేడారం జాతర వైభవంగా జరగనుంది. ఈ మేరకు భక్తులకు తల్లుల చెంతకు చేర్చేందుకు ఆర్టీసీ అన్ని విధానాల సౌకర్యాలను కల్పించింది. మేడారం జాతరకు వెళ్లే భక్తులతో ఆర్టీసీ ప్రాంగణం కిటకిటలాడింది. నాలుగు రోజులపాటు భక్తుల రద్దీ మరింత పెరగనుంది.



జాతరకు వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్న భక్తులు



యాటపోతును తీసుకెళ్తున్న భక్తుడు



జాతరకు వెళ్తున్న భక్తురాలు

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

గార్ల: గార్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకొని గత ఏడాది జేఈఈ అడ్వాన్స్‌లో సీటు సాధించిన బానోత్ ఆకాష్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి (డీఐఈఓ) సమ్మెట సత్యనారాయణ సూచించారు. మంగళవారం గార్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చదువు అనేది విద్యార్థులకు సోషల్ స్టేటస్ కాదని, ప్రతీ విద్యార్థి ఒక లక్ష్యం ఎంచుకొని చదువుల్లో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రిన్సిపాల్



మాట్లాడుతున్న అధికారి సత్యనారాయణ

అసోసియేషన్ అధ్యక్షుడు సదానందం, కార్యదర్శి వీరేంద్ర, అప్పయ్య, గోవిందరావు, రవీందర్, రఘుబాబు, ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని మానుకోట డీఎస్పీ ఎన్. తిరుపతిరావు అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పదో తరగతి టాలెంట్ టెస్ట్ సభకు డీఎస్పీ హాజరై ప్రశ్నపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు బయపడకుండా పరీక్షలు రాయాలన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. సంఘం డివిజన్ కార్యదర్శి సూర్యప్రకాష్, అధ్యక్షతన



ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ

జరిగిన కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి సాయి కుమార్, ఉపాధ్యాయురాలు గిరిజ, నాయకులు సింహాద్రి, రాజేష్, ఎలియాజ్ పాల్గొన్నారు.

వార్డు సమస్యలు పరిష్కరించాలి

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి దాసరి మల్లేశం కోరారు. పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం 13వ వార్డులో పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిశీలించారు. వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వీధి లైట్లు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. పందులు, దోమలు, కుక్కల బెడదతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలి



పూజలో పాల్గొన్న లింగయ్యదొర

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తనకు పార్టీ అధిష్టానం అవకాశం కల్పించాలని ఖమ్మం మాజీ జెడ్పీ చైర్మన్, బూర్గంపాడు మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర కోరాడు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయంలో లింగయ్య పలు కులసంఘాల నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఆదివాసీ కోయలు అధికంగా ఉన్నారని, జనాభా నిష్పత్తిని గుర్తించి అధిష్టానం ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరాడు. కార్యక్రమంలో వట్టం నారాయణదొర, వాసం రామకృష్ణదొర, పాయం సత్యనారాయణ, పొడుగు శ్రీనివాస్, తాటి జనార్దన్, సోయం సుఖారాం, కొమురం బుచ్చయ్యదొర, గొగ్గలి రామకృష్ణ, కొమురం శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పోక్సో కేసు నమోదు

గార్ల: మండలంలోని ఓ గ్రామంలో బాలికను తీసుకెళ్లిన అదే గ్రామానికి చెందిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై జీనత్‌కుమార్ మంగళవారం తెలిపాడు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని పెద్దకిష్టాపురం పంచాయతీలోని ఓ గ్రామానికి చెందిన 10వ తరగతి చదువుతున్న బాలికను, అదే గ్రామానికి చెందిన యువకుడు మాయమాటలు చెప్పి ఈనెల 14న తీసుకెళ్లాడు. బాలిక తల్లితండ్రులు కూతురు కనిపించడం లేదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం అర్ధరాత్రి పోలీసులు నిందితుడి పట్టుకొని పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య



రమేష్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురై భర్త ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన మహబూబాబాద్ జిల్లాలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి తెలిపిన వివరాలు.. మహబూబాబాద్ మండలంలోని బలరాంతండా గ్రామానికి చెందిన రైతు పెద్దపులి రమేశ్(33)కు సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం మంగాపురం తండాకు చెందిన శాంతితో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. కాగా వీరికి దివ్యశ్రీ, విఘ్నేష్, అజిత్ కుమార్ పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో భార్యభర్తల మధ్య కుటుంబ తగాదాలతో ఆరు నెలల క్రితం శాంతి తల్లిగారింటికి వెళ్లిపోయింది. అదే కోపంతో అతడు బత్తాయి పండులో విషం కలిపి తన చిన్న కుమారుడు అజిత్‌కుమార్‌కు ఇచ్చాడు. కాగా బతాయి పండును తీసుకువెళ్లి తాను తినడంతో పాటు తన పెద్దనాన్న కుమార్తె వైష్ణవికి కూడా ఇచ్చాడు. ఈ క్రమంలో అజిత్ కుమార్ మృతిచెందగా వైష్ణవి చికిత్స పొంది ఇంటికి వెళ్లింది. అప్పుడు రమేష్ పై కేసు నమోదు కాగా జైలుకు వెళ్లి శిక్ష అనుభవించి ఇంటికి వచ్చాడు. అప్పటి నుంచి భార్యభర్తలు కలిసి ఉంటున్నారు. మళ్లీ నెల రోజుల క్రితం రమేష్, శాంతికి కుటుంబ తగాదా కాగా భార్య పిల్లలను తీసుకుని తల్లిగారింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన రమేష్ మంగళవారం ఉదయం ఆమనగల్‌లోని రైతు వేదిక సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు బంధువులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకుని పోలీసులకు విషయం తెలియజేశారు. మృతుడి భార్య శాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం వారికి మృతదేహాన్ని అప్పగించారు.

24, 25 తేదీల్లో బొడ్రాయి వార్షికోత్సవం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పట్టణంలో ఈనెల 24, 25 తేదీల్లో నిర్వహించే బొడ్రాయి వార్షికోత్సవ వేడుకల ఏర్పాట్లపై వేణుగోపాలస్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. భక్తుల సౌకర్యార్థం బొడ్రాయి వద్ద జరగాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. సమావేశంలో శ్రీనివాస్ రెడ్డి, నాగేశ్వర్ రావు, అంజయ్య, రమేష్, వేణుమాధవ్, సుధాకర్ పాల్గొన్నారు.

విష్ణు సహస్రనామ పారాయణం

గార్ల: భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా మంగళవారం గార్లలోని సాయిబాబా మందిరంలో శ్రీరామనామ భజనమండలి బృందం ఆధ్వర్యంలో 108 పర్యాయాలు విష్ణుసహస్రనామ పారాయణం పఠించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

ఇంటర్నెట్ సెంటర్‌లో చోరీ

- రూ.4లక్షల నగదు, రూ.2లక్షల విలువైన వస్తువుల అపహరణ

బయ్యారం: మండలకేంద్రంలోని ఇల్లెందు–మహబూబాబాద్ ప్రధాన రహదారి పక్కన ఉన్న ఎంఆర్ఎం నెట్‌సెంటర్‌లో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. శనివారం రాత్రి లూటీ చేసిన ఏటీఎంకు సమీపంలో రేకులతో ఉన్న ఇంటర్నెట్‌సెంటర్‌లోకి వెనుక నుంచి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడ్డారు. సుమారు రూ.2లక్షల విలువైన హార్డ్‌డిస్క్‌లు, మానిటర్, ఇన్వర్టర్ బ్యాటరీ, సీపీయూతోపాటు ఇంటి నిర్మాణానికి బ్యాంకు నుంచి తెచ్చిన రూ.4లక్షల నగదును దొంగలించినట్లు నెట్‌సెంటర్ నిర్వాహకుడు మోహన్ తెలిపాడు. రెండురాత్రుల వ్యవధిలోనే చోరీలు జరగడంతో స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. చోరీకి గురైన నెట్‌సెంటర్‌ను గార్ల–బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై ఉపేందర్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చోరీ జరిగిన ఇంటర్నెట్ సెంటర్

ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎం విశ్వనాథ్

తొర్రూరు: చలివేంద్రం ఏర్పాటుతో ప్రజల దాహార్తి తీరుతుందని తొర్రూరు ఆర్టీసీ డీఎం విశ్వనాథ్ తెలిపారు. మేడారం జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీఎం ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. మేడారం జాతరకు తొర్రూరు డిపో నుంచి 186 బస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు సిరికొండ విక్రమ్‌కుమార్, ఎస్‌టీఐ రజితారెడ్డి, సంస్థ ప్రతినిధులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి

తొర్రూరు రూరల్: ఆధ్యాత్మికతను ప్రతీ ఒక్కరూ పెంపొందించుకోవాలని జగద్గురు గీతాశ్రమ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ జ్ఞాన చైతన్యానంద స్వామిజీ అన్నారు. మంగళవారం మండలంలోని వెలికట్ట గ్రామ శివారులో ఆశ్రమ 19వ వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రణవానందస్వామి మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక జీవితాన్ని గడపడం, ధ్యానం, ప్రార్థన, యోగా, శ్రద్ధ, భక్తి వంటివాటి ద్వారా అపారమైన ఆరోగ్య ప్రయోజనాలు కలుగడంతోపాటు ఎలాంటి ఒత్తిడి లేకుండా మన శాంతితో జీవించవచ్చాన్నారు. కార్యక్రమంలో మనోహర్ నారాయణ శాస్త్రి, శ్రీహరితీర్థ స్వామి, పరమేశ్వరి మాతాజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైతన్యానంద స్వామిజీ

ఆహార భద్రతా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

మరిపెడ రూరల్: ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తరించి రేషన్ కార్డుపై 14రకాల సరుకులను పేద ప్రజలకు పంపిణీ చేసేలా, ఆహార భద్రతా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాణాల రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మంగళవారం మండలంలోని బుర్హాన్‌పురం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదులో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తుందన్నారు. కార్యక్రమంలో మధుసుదన్, లక్ష్మారెడ్డి, లక్ష్మమ్మ, వీరస్వామి, సైదమ్మ, ఇద్దమ్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కురవి: మండల కేంద్రంలో నేడు(బుధవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ శారద మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11కేవీ విద్యుత్ లైన్‌పై ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

మహబూబాబాద్ నుంచి అవకాశం కల్పించాలి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని ఐఎన్‌టీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు నూనావత్ శంకర్ నాయక్ కోరారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను హైదరాబాదులో మంగళవారం కలిసి విజ్ఞప్తి చేశాడు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

చిన్నగూడూరు: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్‌లో బీజేపీ సత్తా చాటాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎలమంచిలి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు యాకన్న, నవీన్, వేణు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మేడారం బస్సులు ప్రారంభం

గూడూరు: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి మంగళవారం మేడారం జాతరకు బస్సులను కండక్టర్లు ఎస్కే ఆజాద్ పాష, రమేష్, ఈశ్వర్, డ్రైవర్లు శ్రీనివాసులు ప్రారంభించారు.

దుర్గమ్మకు బోనాలు

గూడూరు: మండలంలోని బొల్లెపల్లిలో మంగళవారం దుర్గమ్మ బోనాల పండుగను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే పూజా కార్యక్రమాలు ముగించుకున్న మహిళలు బోనం ఎత్తుకొని దుర్గమ్మ దేవాలయానికి మేళ తాళాలు, డప్పుచప్పుళ్ల నడుమ బయలుదేరారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

తొర్రూరు: మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కమిషనర్ శాంతి కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ.. హచ్చుతండా సమీపంలోని మున్సిపాలిటీ డంపింగ్‌యార్డు పరిధిలో రూ.15లక్షలతో ప్రహరీ నిర్మించనున్నట్లు తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ ఎన్నమనేని శ్రీనివాసరావు, నాయకులు కర్నె నాగరాజు, ధరావత్ జైసింగ్, మన్నూరు ఉమ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరిస్తాం..

డోర్నకల్: పారిశుద్ధ్య సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని డోర్నకల్ మున్సిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మంగళవారం కమిషనర్ పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాల మరమ్మతులు చేయించి చెత్త సేకరణ పనులను పూర్తిస్థాయిలో చేపట్టనున్నట్లు తెలిపారు. వార్డుల్లో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదగాలని డీఈఓ రామారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో మంగళవారం జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడార పాఠశాల స్థాయిలో విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకునేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. ఈ నెల 24న జరగనున్న రాష్ట్రస్థాయి సైన్స్ టాలెంట్ టెస్టుకు ఎంపికైన విద్యార్థులు ఆర్.లుకేష్, డి.ఉదయ్, జి.శివకుమార్‌కు బహుమతులు అందజేశారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ కార్యవర్గ సభ్యుడు వి.గురునాథరావు, జిల్లా సైన్స్ అధికారి బి.అప్పారావు, గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ బి.విజయ కుమారి, సైన్స్ ఉపాధ్యాయులు మోత్కూరి వెంకటేశ్వర్లు, విజయ్‌రాజ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్, సోమేశ్వర్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నాయకులను విడుదల చేయాలి

బయ్యారం: పోలీసుల అదుపులో ఉన్న నాయకులను విడుదల చేయాలని కోరుతూ మంగళవారం బయ్యారంలో న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా నాయకురాలు ఊకే పద్మ మాట్లాడుతూ.. అక్రమంగా అరెస్ట్ చేసిన మండలానికి చెందిన నాయకులు ననప పొమ్మయ్య, కొమరయ్య, కొండన్న, భాస్కర్‌లను వెంటనే విడిచిపెట్టాలన్నారు.